DC తెలుగు దక్కన్ డిజిటల్ మీడియా

# బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్‌కు బెదిరింపులు

**రూ. 5కోట్లు డిమాండ్ చేస్తూ**

**పోలీసులకు మెసేజ్**

**అప్రమత్తం అయిన పోలీసులు..**

**మెసేజ్‌పై ఆరా**

**ముంబై, అక్టోబర్18 :** బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ కు మరోసారి బెదిరింపులు వచ్చాయి. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో ఉన్న వైరానికి ముగింపు పలకాలంటే రూ.5 కోట్లు ఇవ్వాలంటూ అగంతకులు బెదిరింపులకు పాల్పడ్డారు. ముంబయి ట్రాఫిక్ పోలీసుల వాట్సప్ నంబర్‌కు ఈ మెసేజ్ రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. గురువారం రాత్రి ముంబయి ట్రాఫిక్ పోలీసులకు ఈ మెసేజ్ వచ్చింది. 'ఈ బెదిరింపులను తేలిగ్గా తీసుకోవద్దు. సల్మాన్ ఖాన్ ప్రాణాలతో ఉండాలన్నా.. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో శత్రుత్వాన్ని ముగించుకోవాలన్నా ఆయన రూ.5కోట్లు చెల్లించాలి. ఈ డబ్బులు ఇవ్వకపోతే ఇటీవల హత్యకు గురైన మాజీ ఎమ్మెల్యే సిద్ధిఖీ కంటే ఆయన దారుణమైన పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుందని దుండగులు అందులో బెదిరించారు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించామని, మెసేజ్ ఎక్కడినుంచి వచ్చిందన్న దానిపై విచారణ జరుపుతున్నామని ముంబయి పోలీసులు వెల్లడించారు. ఈనేపథ్యంలో బాంద్రాలోని ఆయన నివాసం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. కాగా.. సల్మాన్‌ఖాన్‌కు ఇలా బెదిరింపులు రావడం ఇదే తొలిసారి కాదు. గతంలోనూ పలుమార్లు బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి ఆయనకు బెదిరింపులు వచ్చాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో సల్మాన్ నివాసం ఉంటున్న బాంద్రాలోని గెలాక్సీ అపార్ట్‌మెంట్ వద్ద ఇద్దరు వ్యక్తులు కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే. ఇక, అంతకుముందు పన్వేల్ ఫామ్‌హౌస్‌లోకి చొరబడేందుకు కొందరు ప్రయత్నించడం అప్పట్లో కలకలం రేపింది. నటుడి ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో గతేడాది మహారాష్ట్ర ప్రభుత్వం ఆయనకు భద్రతను పెంచింది. ఇదిలాఉండగా.. సల్మాన్ ఖాన్ స్నేహితుడు, ఎన్సీపీ నేత బాబా సిద్ధిఖీ గతవారం దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. ముంబయిలోని బాంద్రాలో తన కుమారుడి కార్యాలయంలో ఉండగా.. ముగ్గురు దుండగులు సిద్ధిఖీపై మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. వెంటనే ఆయన్ను లీలావతి ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ హత్య తామే చేసినట్లు బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించుకుంది.

# టూవీలర్‌పై నుంచి పడి ప్రమాదం

**రోడ్డు ప్రమాదంలో టీచర్ మృతి**

**వినుకొండ, అక్టోబర్18 :** పల్నాడు జిల్లా వినుకొండ మండలం గోకనకొండలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు మునగాల ధనలక్ష్మి(41) రోడ్డు ప్రమాదంలో మరణించారు. నాగులవరం వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. మృతురాలి భర్త నాగేశ్వరరావు, కుటుంబ సభ్యులు, తోటి ఉపాధ్యాయులు తెలిపిన వివరాల ప్రకారం బాపట్ల జిల్లా అద్దంకి చెందిన ధనలక్ష్మి మండలంలోని గోకన కొండ స్కూల్లో టీచరుగా పనిచేస్తున్నారు. ప్రతిరోజు టీచర్ ధనలక్ష్మి అద్దంకి నుండి గోకనకొండ స్కూలుకు వస్తారు. ఆర్టీసీ బస్సులో నాగులవరం వద్దకు వచ్చి అక్కడ ఉంచిన తన స్కూటీ వాహనంపై స్కూలుకు వెళ్తారు. అయితే ఇటీవల కురుస్తున్న వర్షాలకు గత మూడు రోజుల క్రితం గోకన కొండ నుండి స్కూటీపై అద్దంకి వెళితూ చక్రాయపాలెం స్కూల్లో పార్క్ చేసి వెళ్లారు. శుక్రవారం గోకనకొండ స్కూలుకు బయలుదేరి తన స్కూటీ తీసుకుని వచ్చేందుకు చక్రాయపాలెం స్కూల్ వద్దకు ఉదయం 8:30 వెళ్ళగా స్కూలు తాళం తీయకపోవడంతో తోటి ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు ద్విచక్ర వాహనం ఎక్కి గోకన కొండకు బయలుదేరారు. నాగులవరం గ్రామం వద్దకు రాగానే ఎదురుగా ఆర్టీసీ బస్సు రావడంతో ద్విచక్ర వాహనం మార్జిన్ దిగి రోడ్డుపై ఎక్కుతున్న క్రమంలో వాహనం అదుపుతప్పి ఉపాధ్యాయురాలు ధనలక్ష్మి రోడ్డుపై పడి తల వెనుక భాగం పగిలిపోయి అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు వినుకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఆత్మహత్యకకు పాల్పడ్డ ప్రేమ జంట

**గుంటూరు, అక్టోబర్18 :** గుంటూరు జిల్లాలో ప్రేమజంట బలవన్మరణానికి పాల్పడింది. యువతి, యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. పెదకాకాని వద్ద శుక్రవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుంది. మృతులను దానబోయిన మహేశ్(22), నంద్రు శైలజ(21)గా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. పెదకాకాని గ్రామానికి చెందిన మహేశ్, నందిగామ మండలం రుద్రవరానికి చెందిన శైలు గత కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. డిఎ÷-లొమా చదివిన మహేశ్.. రెండేళ్ల క్రితం హైదరాబాద్‌లో ఓ మొబైల్ స్టోర్‌లో పని చేశాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న శైలజతో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. ఇటీవలే ప్రేమ విషయం ఇరు కుటుంబాలకు తెలిసింది. 10 రోజుల క్రితం యువకుడి తల్లిదండ్రులు పెళ్లికి అంగీకరించారు. యువతి కుటుంబసభ్యులు అభ్యంతరం తెలిపినట్లు సమాచారం. దసరా సమయంలో శైలు, మహేశ్ ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లిపోయారు. దీంతో యువతి కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో శుక్రవారం పెదకాకాని సమీపంలో రైల్వే ట్రాక్‌పై విగత జీవులుగా కనిపించారు.